క్లుప్తంగా

జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలి


అసంపూర్తిగా ఉన్న తాగునీటి పైపులైన్

మాకవరపాలెం : అసంపూర్తిగా ఉన్న జల్‌జీవన్ మిషన్ పనులను పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో జల్ జీవన్‌మిషన్ పథకంలో చేపట్టిన పైపులైన్ పనులు అసంపూర్తిగా వదిలేశారు. పైపులైన్ వేసేందుకు తవ్విన గోతులను పూడ్చకుండా వదిలేయడంతో ప్రమాదకరంగా మారాయి. రాకపోకలకు ఇబ్బందిగా మారాయన్నారు. చాలా కాలంగా ఇలాగే ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని తెలిపారు. అధికారులు స్పందించి ఈ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మానవ హక్కుల గురించి అవగాహన


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ షర్మిల శ్రీ

మాడుగుల : మానవ హక్కులు గురించి నేటి విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి. షర్మిల శ్రీ అన్నారు. మంగళవారం జాతీయ మానవ హక్కులు దినోత్సవం సందర్భంగా స్థానిక డిగ్రీ కళాశాలలో రాజనీతి విభాగంతో పాటు ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్తంగా కళాశాల విద్యార్థులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. నేటి విద్యార్థులు వారి హక్కులు, విలువలు తెలుసుకుని భావి భారత మంచి పౌరులుగా ఎదగాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవడంతో పాటు కాలుష్య నివారణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆర్గనైజర్ బి.రాజు, ఉపన్యాసకులు నారాయణఅప్పల నాయుడు, ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

రైవాడ కెనాల్‌లో నాచు తొలగింపు పనులు


కెనాల్లో నాచు తొలగించే పనుల్లో లష్కర్‌లు

కె.కోటపాడు : రైవాడ కెనాల్ మార్గంలో జీవీఎంసీ లష్కర్‌లు నాచు తొలగింపు పనులు చేపడుతున్నారు. మంగళవారం కొరువాడ–డి.అగ్రహారం గ్రామాల మధ్య గల కెనాల్ మార్గంలో ఈ పనులు చేపట్టారు. కెనాల్లో నాచు, మొక్కలు పేరుకుపోవడంతో జలాశయం నుంచి విశాఖపట్నానికి ప్రతి రోజు వచ్చే 50 క్యూసెక్కుల నీటి ప్రవాహంలో అంతరాయం కలుగుతుంది. ఈ కారణంగా జీవీఎంసీ అధికారులు నాచు, మొక్కలను తొలగింపు పనులు చేపడుతున్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ పునరుద్ధరించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు

మాడుగుల : ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్న మాడుగుల ఆర్టీసీ కాంప్లెక్స్‌ను పునరుద్ధరించాలని మంగళవారం స్థానిక అఖిల పక్ష నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు అఖిలపక్ష నాయకులు పార్టీలకు అతీతంగా ర్యాలీలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి కాంప్లెక్స్ బాగు చేసి, కాంప్లెక్స్‌కు ఆర్టీసీ బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మంచి ఆలోచనలతోనే మానసిక ప్రశాంతత

మాకవరపాలెం: మంచి ఆలోచనలతో మానసిక ప్రశాంతత ఉంటుందని బ్రహ్మకుమారీస్ సమాజం అనకాపల్లి శాఖ సభ్యురాలు విద్య అన్నారు. తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ధ్యానంపై అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో అవంతి విద్యాసంస్థల అధినేత, మాజీ మంత్రి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్య మాట్లాడుతూ కోపం, చిరాకు, దురాలోచనలు మనిషిలో శాంతిని దూరం చేస్తాయన్నారు. ఆలోచనలు బట్టి మానసిక ప్రశాంతత ఆధారపడి ఉంటుందన్నారు. ధ్యానంతో దైనందిన జీవితంలోని ఒత్తిడులను జయించవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7997958337, 7075709854, 7997958336

కుంగిన రైతు నెత్తిన కూలీ కుంపటి

- వరికోత పనులకు కూలీల కొరత
- పెరిగిపోయిన కూలి రేట్లు
- కోతకొచ్చిన పంటపై ముసురుతున్న మబ్బులు


కాముడుపాలెం చెరువు అభివృద్ధి పనుల్లో ఉపాధి కూలీలు

అన్నదాత పని అడకత్తెరలో పోక చెక్కలా మారింది. ఖరీఫ్‌లో నాట్లు, గాబులు, తెగుళ్ల నివారణ ప్రధానంగా రెక్కరాల్చే పురుగు తెగులు తదితర అడ్డంకులన్నీ దాటుకుని రైతులు వరి పంట పండించుకున్నారు. కోత దశలో ఒక్క పక్క ముసురుతున్న మబ్బులు, మరో పక్క కూలీల కొరతతో అన్నదాత పరిస్థితి అయోమయంగా మారింది.


రోలుగుంటలో గాలులకు నేల వాలి రాలిపోతున్న వరిపంట

రోలుగుంట : ఈ ఖరీఫ్‌లో మండలంలో సాధారణ విస్తీర్ణానికి మించి పల్లం, మెరక అనే వ్యత్యాసం లేకుండా 1342 హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణం కాగా 1800 కు పైబడిన హెక్టార్లలో వరినాట్లు పడ్డాయి. ప్రారంభం నుంచి ప్రభుత్వం నుంచి ఏ విధమైన సాగు పెట్టుబడులు గత ప్రభుత్వం(వైఎస్సార్‌సీపీ) మాదిరిగా అందక, రైతులు అప్పులతో సాగు చేశారు. ఉన్న తెగుళ్ల చాలవంటూ ఈ ఏడాది రెక్కరాల్చు పురుగు వేధించింది. దీనిని కూడా వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ సస్య రక్షణ పాటించి పంట పండించుకోవడం జరిగింది. మండలంలో అన్ని గ్రామాల్లో వరి పంట కోతకు రావడంతో రైతులంతా కోతల మొదలు పెట్టారు. దీంతో కూలీల కొరత ఏర్పడింది. ఒక పక్క అన్నిచోట్ల ఒకేసారి కోతల పనులు ప్రారంభం అయితే ఎన్ఆర్ఈజీఎస్ పథకం అమలులో భాగంగా ఆ శాఖ వారు ఉపాధి పనులు జరిపించడం వ్యవసాయరంగానికి భారంగా మారింది. ప్రభుత్వం ఉపాధి పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తే రైతుల పరిస్థితి మెరుగుపడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


కూలీలు దొరక్క ఒక్కరే పంట భూమిలో కోత కోసుకుంటున్న భూ యజమాని

ఉపాధి పథకాన్ని అనుసంధానం చేయాలి



నేను రెండెకరాల్లో వరి సాగు చేశాను. నాట్లు, గాబులు, తెగుళ్ల కోసం పురుగురు మందు పిచికారీ, ఎరువుల వినియోగం కలిసి రూ.45 వేలు పైబడి పెట్టుబడి అయింది. ప్రస్తుతం పంట పండి కోత దశలో ఉంది.కూలీలు దొరకలేదు. డబుల్ కూలీ ఇస్తామన్నా కూలీలు దొరికే పరిస్థితి లేదు. ఎన్ఆర్ఈజీఎస్ పనుల వైపే అందరూ మొగ్గు చూపుతున్నారు. వ్యవసాయానికి ఉపాధి పథకం అనుసంధానం చేస్తే కొంతమేర సమస్య తీరుతుంది. ఇదే సమయంలో తుపాను హెచ్చరికలతో ముసిరిన ముబ్బులు మళ్లీ ఆందోళన కలిగిస్తోంది.

– రుత్తల నానిబాబు, రైతు, రోలుగుంట

బంధువుల తోడ్పాటు..



నేను ఎకరాన్నరలో వరి సాగు చేపట్టాను. అప్పులు చేసి పెట్టుబడి పెట్టి తెగుళ్ల నియంత్రణ, సాగు పనులు పూర్తయి పంట కోత దశకు వచ్చింది. కోతకు కూలీలు దొరకక పొరుగు గ్రామాల్లో ఉన్న బంధువులను ఆశ్రయించాల్సి వచ్చింది

– మద్దు నానిబాబు

కోత పనికి సాయం వచ్చాను



నాది నర్సీపట్నం దగ్గర అమలాపురం. మాకు అక్కడ కూలీలు దొరకక రోలుగుంటలో గల నా బంధువుల కోతపని సాయం వచ్చారు. నేను కూడా ఇక్కడకు కోతల పనికి సాయం వచ్చాను. రైతుకు ఎంతో ముఖ్యమైన ఈ సీజన్‌కు ఉపాధి పనులు నిలపుదల చేసి వ్యవసాయరంగానికి అనుసంధానం చేయాలి.

– మేడిశెట్టి నూకాలతల్లి, అమలాపురం, నర్సీపట్నం మండలం

కొన్ని అభివృద్ధి పనులకే...

ఎన్ఆర్ఈజీఎస్ పథకం నుంచి కొన్ని అభివృద్ధి పనులకే అనుసంధానం అనుమతులున్నాయి. రైతులు కోరుతున్న వ్యవసాయ పనులు వరి, చెరకు, పప్పుదినుసుల తదితర పనుల్లో హాజరుపరచాలన్నది ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

– పి.ఈశ్వర్రావు, ఏపీవో, ఎన్ఆర్ఈజీఎస్, రోలుగుంట

పెండింగ్ భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి


రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్

నాతవరం : ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కారిస్తామని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ అన్నారు. వై.డి.పేట రెవెన్యూ గ్రామంలో మంగళవారం జరిగిన సదస్సులో రైతుల నుంచి 25 దరఖాస్తులు స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్లు లోవరాజు, శివ, మాజీ జెడ్పీటీసీ సత్యనారాయణ, మాజీ ఎంపీపీ సన్యాసిదేముడు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: మండలంలోని తూటిపాలలో రెవెన్యూ సదస్సు జరిగింది. సచివాలయం వద్ద జరిగిన సదస్సులో భూ సమస్యలపై రైతుల నుంచి డీటీ సోమశేఖర్ వినతులు స్వీకరించారు. సకాలంలో వినతులను పరిష్కరిస్తామన్నారు. మాజీ మండల ఉపాధ్యక్షుడు వెంకటరమణ, ఆర్ఐ జెట్టి పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: గ్రామాల్లో నెలకొని ఉన్న భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ గ్రామ సదస్సులు దోహదపడతాయని రీసర్వే డీటీ కె.గణపతిరావు అన్నారు. మంగళవారం కింతలి వల్లాపురం, కింతలి గ్రామాల్లో నిర్వహిస్తున్న సదస్సులో రైతుల నుంచి 10 దరఖాస్తులు స్వీకరించారు. కింతలి వల్లాపురం సర్పంచ్ టి.రామబాయి, స్థానిక నాయకుడు రాంబాబు, కింతలి సర్పంచ్ భవానీ, ఎంపీటీసీ సభ్యుడు సన్యాసిరావు, మండల సర్వేయరు జగదీశ్, వీఆర్ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

కె.కోటపాడు : దాలివలస గ్రామంలో తహసీల్దార్ వి.భాగ్యవతి ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. సదస్సులో 8 మంది భూ సమస్యల పరిష్కారానికి అర్జీలను అందించారు. డిప్యూటీ తహసీల్దార్ రమేష్, గ్రామ రెవెన్యూ అధికారి శివ, సర్పంచ్ దేముళ్ళు, మాజీ సర్పంచ్ రాము నాయుడు పాల్గొన్నారు.

దేవరాపల్లి: మండలంలోని తారువలో స్థానిక సర్పంచ్ గొంప వరహాలమ్మ అధ్యక్షతన మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. కార్యక్రమంలో తహసీల్దార్ పి.లక్ష్మీదేవి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండల సర్వేయర్ గోవిందరాజులు, ఆర్ఐ సతీష్, వీఆర్వో స్వాతి పాల్గొన్నారు.

చీడికాడ : రెవెన్యూ సదస్సుల్లో వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ ప్రసాదరావు అన్నారు. అర్జునగిరిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 46 దరఖాస్తులు స్వీకరించారు. సర్పంచ్ రమాదేవి, ఎంపీటీసీ అమ్మతల్లినాయుడు, ఉప సర్పంచ్ వరలమ్మ అప్పలనాయుడు పాల్గొన్నారు.

రోలుగుంట: నిండుగొండ గ్రామంలో మంగళవారం జరిగిన రెవిన్యూ సదస్సులో తహసీల్దార్ నాగమ్మ పాల్గొన్నారు. రైతుల నుంచి వినతులు స్వీకరించారు.

టెంట్ హౌస్ రాము ఆకస్మిక మృతికి సంతాపం


బొడ్డేడ రాము(ఫైల్)

మాడుగుల రూరల్ : దివ్యాంగుల సేవకుడిగా, సాంఘిక సేవకుడుగా కె.జె.పురం గ్రామంలో గుర్తింపు పొందిన బొడ్డేడ రామారావు (టెంట్ హౌస్ రాము) (67) సోమవారం అర్ధరాత్రి అకస్మాత్తుగా మృతి చెందారు. ఆయన కె.జె.పురం గ్రామంలో తొలిసారిగా టెంట్‌హౌస్‌ను ప్రారంభించి తక్కువ వ్యయంతో టెంట్‌హౌస్ సామాన్లు అందించేవారు. దివ్యాంగుడు అయిన రామారావు దరఖాస్తులు, ప్రాంసరీ నోట్లు, ఇతర డాక్యుమెంట్లు ఉచితంగా రాసి ఆదర్శంగా నిలిచారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు గురించి, విద్యార్థులకు మెరుగైన విద్య అవకాశాలు గురించి అవగాహన కల్పించేవారు. రాము మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అతని భౌతిక కాయాన్ని జిల్లా కేంద్ర గౌరీ సంఘం ప్రధాన కార్యదర్శి ఆడారి లచ్చుఅప్పారావు, సర్పంచ్ జామి రమణబాబు, పలువురు ప్రజా ప్రతినిధులు సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మ విస్తృత ప్రచారం



ఉపాధ్యాయులతో రఘువర్మ

నాతవరం : ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి శాసనమండలికి పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మ మండలంలో ఎన్నికల ప్రచారం మంగళవారం నిర్వహించారు. నాతవరం, గునుపూడి, మన్యపురట్ల డి,యర్రవరం తదితర గ్రామాల్లో పర్యటించి అక్కడ ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. తనకు మొదట ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. మీ అందరి సహకారంతో విజయం సాధిస్తే ఉపాధ్యాయుల సమస్యలపై శాసనమండలిలో గళమెత్తుతానన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కూండ్రపు సత్యనారాయణ, నాతవరం మండల యూనియన్ గౌరవ అధ్యక్షుడు సబ్బవరపు సత్యనారాయణ, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు అప్పన్నబాబు, జగన్నాథరావు, యూనియన్ నాయకులు పెంటారావు, ఫణికుమార్ పాత్రుడు, రవికిరణ్ పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ స్థలంలో ప్రైవేటు వ్యక్తుల పాగా

నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధి పీనారపాలెంలో ఉన్న అర్అండ్‌బీ కార్యాలయానికి ఎదురుగా మెయిన్ రోడ్డుకు అనుకోని 10 సెంట్లు అర్అండ్‌బీ స్థలం ఉంది. ఆ స్థలాన్ని గతంలో ఆక్రమించేందుకు ప్రయత్నించారు. అప్పట్లో ఉన్న అధికారులు సర్వే చేయించి కాంపౌండ్‌వాల్ నిర్మించారు. అర్అండ్‌బీ స్థలాన్ని అనుకుని ఉన్న ప్రైవేట్ స్థలంలో ఇటీవల నిర్మాణం చేపట్టారు. అర్అండ్‌బీ స్థలానికి నిర్మించిన కాంపౌండ్‌వాల్‌ను దర్జాగా తొలగించి నిర్మాణ సామగ్రి ఆ స్థలంలో వేసుకున్నారు. డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలాన్ని ఇలా ప్రైవేటు వ్యక్తులు వినియోగించుకుంటున్నా చర్యలకు వెనకాడుతున్నారు. దీంతో అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై ఏఈ కె.నారాయణరెడ్డిని సంప్రదించగా కాంపౌండ్‌వాల్ తొలగించిన వెంటనే హెచ్చరించామన్నారు. 10 సెంట్లకు సంబంధించిన రికార్డు గతంలో పని చేసిన అధికారులు ఇవ్వలేదని, సర్వేకు తహసీల్దార్‌కు లెటర్ పెట్టామని అన్నారు. హద్దులు నిర్ధారించి స్థలం ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

అల్ప పీడనంపై అప్రమత్తం..


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో అప్పారావు

నర్సీపట్నం : తుఫాన్ పొంచి ఉన్నందున వరి కోతలను వాయిదా వేసుకోవాలని వ్యవసాయాధికారి అప్పారావు రైతులకు సూచించారు. పెదబొడ్డేపల్లి, చెట్టుపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు తుఫాన్ ప్రభావం ఉందన్నారు. వరి రైతులు పంటల బీమా పథకంలో చేరాలన్నారు.

మాడుగుల రూరల్: అల్పపీడనం వల్ల ఈ నెల 11 వ తేదీ నుంచి మూడు రోజుల పాటు రైతులు వరి కోతలు కోయవద్దని మండల వ్యవసాయాధికారి వాసుదేవరావు సూచించారు. మంగళవారం వీరనారాయణం, జి.అగ్రహారం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

చోడవరం : రానున్న మూడు రోజుల్లో అల్పపీడన ద్రోణి కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికార యంత్రాంగం అంతా అప్రమతంగా ఉండాలని రావికమతం తహసీల్దార్ వెంకటరమణ అన్నారు. కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు.

దేవరాపల్లి : తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వరి కోతలు, నూర్పులనువాయిదా వేసుకోవాలని వ్యవసాయ అధికారి కాంతమ్మ రైతులకు సూచించారు. దేవరాపల్లి,కాశీపురం తదితర గ్రామాలలో మంగళవారం పర్యటించి రైతులకు సూచనలు చేశారు.

చీడికాడ : రానున్న మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరికోతలను వాయిదా వేసుకోవాలని ఏవో కృష్ణవేణి కోరారు. మంగళవారం ఆమె పలు గ్రామాల్లో పర్యటించారు.

సీపీఐ నేతల రాస్తారోకో

చోడవరం : వెంకన్నపాలెం–చోడవరం రోడ్డులో దెబ్బతిన్న కల్వర్టు రక్షణ గోడలు వెంటనే నిర్మించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం రాస్తారోకో చేశారు. ఈ రోడ్డు చోడవరం సమీపంలో ఉన్న పెద్దమదుం రక్షణ గోడలు ఇటీవల వాహనాలు ఢీకొడంతో పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో రక్షణ గోడలు లేక ఈ మదుం వద్ద వాహనాల రాకపోకలు ప్రమాదకరంగా మారాయి. దీంతో మదుంకు వెంటనే రక్షణ గోడలు నిర్మించాలని కోరుతూ రాస్తారోకో చేశారు. సీపీఐ జిల్లా ప్రతినిధి రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ చర్యలు తీసుకోకపోతే ఆర్అండ్‌బీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. రాస్తారోకో కారణంగా రోడ్డుకు ఇరుపక్కలా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

బాల్య వివాహాలను అరికట్టాలి

- బాలికల్లో విద్యాప్రమాణాలు పెంపొందించాలి
- సీడీపీవో మేరీ సువార్త


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో మేరీ సువార్త

నర్సీపట్నం : బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సంపూర్ణ సహకారాన్ని అందించాలని నర్సీపట్నం సీడీపీవో మేరీ సువార్త పేర్కొన్నారు. ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం మండలస్థాయి కిషోర్ వికాసం పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బాల్య వివాహాలను ఆరికట్టి, బాలికల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. కిశోర వికాస కార్యక్రమం ద్వారా బాలికల బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసి, ఉన్నతస్థాయి జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు సమష్టి కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీ, వైద్య, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పని చేసి బాల్య వివాహాలను ఆరికట్టాలన్నారు. సెక్స్ రేషియో కూడా తక్కువగా ఉందని ఆడపిల్ల అని తెలిస్తే అబార్షన్ చేయించే పరిస్థితికి వచ్చారని, ఇందుకు సంబంధించి పూర్తిస్థాయిలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రమాకుమారి, మహిళలు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణపై నిర్లక్ష్యంతో ప్రమాదాలు

నర్సీపట్నం : ప్రస్తుతం రోడ్లపై అత్యధిక ప్రమాదాలు ద్విచక్ర వాహనదారుల నుంచి నమోదవుతున్నాయని, దీనికి ప్రధాన కారణం హెల్మెట్ ధరించకపోవడమేనని నర్సీపట్నం టౌన్ సీఐ జి.గోవిందరావు పేర్కొన్నారు. పోలీసు, సీఎంఆర్ షాపింగ్ మాల్ సిబ్బంది రోడ్డు ప్రమాదాల నివారణలో హెల్మెట్ ధారణపై పట్టణంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి సీఐ మాట్లాడుతూ యువత బైక్‌లను ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా నడపడంతో చాలామంది ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. వాహనదారుడు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. వాహనదారులు లైసెన్స్, ఇన్సూరెన్స్, టాక్స్ కలిగి ఉండాలన్నారు. మైనర్‌లకు వాహనాలను ఇవ్వరాదన్నారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదాల్లో అధికంగా తలకు గాయాలై చనిపోవడం, వికలాంగులు కావడం జరుగుతుందన్నారు. వాహనం నడిపేటప్పుడు మొబైల్ వాడడం వల్ల కూడా ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు రమేష్, ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జీతాలు తక్షణమే చెల్లించాలి


గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

నర్సీపట్నం : పారిశుధ్య కార్మికుల జీతాలను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు డిమాండ్ చేశారు. జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు మంగళవారం మున్సిపల్ స్టేడియం గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలకు సంబంధించి 10వ తేదీ వచ్చినప్పటికీ జీతాలు చెల్లించలేదన్నారు. క్రిస్మస్, సంక్రాంతి పండగల నెలల్లో జీతాలు సకాలంలో చెల్లించకపోవడం వల్ల కార్మికుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ఈఎస్ఐ కటింగ్ అవుతున్నా కార్డులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. గత ఏడాదిలో జరిగిన సమ్మె ఒప్పందాలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, వర్కర్స్ యూనియన్ నాయకులు జోగులు, శ్రీను, రాజు, అర్జమ్మ, దుర్గా, బాబురావు పాల్గొన్నారు.

మెరుగైన భవిష్యత్తుకు 'సంకల్పం' చేసుకోండి

విద్యార్థులకు సీఐ రేవతమ్మ హితవు

నర్సీపట్నం : మాదకద్రవ్యాల బారిన పడి భవిష్యత్ ను నాశనం చేసుకోవద్దని రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ పేర్కొన్నారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా గురందరపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలు ఎవరైనా మాదకద్రవ్యాలకు అలవాటు పడినట్టు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మాదకద్రవ్యాల నివారణకు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఎంతో మంది యువత సరదాగా మొదలుపెట్టిన అలవాటు వ్యసనంగా మారి వారి భవిష్యత్తును నాశనం చేస్తుందన్నారు. అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. విద్యార్థులు సమాజ అభివృద్ధికి తద్వారా దేశ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ చినబాబు, హెచ్ఎం దొరబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ ఎంతో కీలకం.. దారి తప్పితే నరకం


విద్యార్థులతో సంకల్పం పోస్టర్ విడుదల చేస్తున్న ఎస్ఐ భీమరాజు

నాతవరం: చదువుకునే ప్రతి ఒక్కరికి విద్యార్థి దశ జీవితంలో చాలా కీలకమైందని నాతవరం ఎస్ఐ సిహెచ్.భీమరాజు అన్నారు. మన్యపురట్ల నాతవరం హైస్కూల్లో విద్యార్థులకు మంగళవారం సంకల్పం కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ విద్యార్థి దశలో మంచి అలవాట్లపై దృష్టి సారించి కష్టపడి చదువుకుంటే అనుకున్న ఆశయం నేరడం ఖాయమన్నారు. చెడు వ్యసనాలపై దృష్టి సారిస్తే విలువైన జీవితం కళ్ల ముందే నాశనం అవుతుందన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో మంచి కంటే చెడుపై అధికంగా దృష్టి సారించి బంగారు భవిష్యత్తును చేతులారా నాశనం చేసుకుంటున్నారని కొన్ని సంఘటనలు ద్వారా వివరించారు. విద్యారంగంలో ఎన్నో రకాల సదుపాయాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల ప్రకారం విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ డి సర్టిఫికెట్లు అందించండి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న తూర్పుకాపు సంఘ నాయకుడు నానాజీ

బుచ్చెయ్యపేట : బీసీ డి కుల సర్టిఫికెట్లు అందించి ఆదుకోవాలని తూర్పు కాపు సంఘ నాయకులు తహసీల్దార్ లక్ష్మిని కోరారు. మంగళవారం లోపూడిలో జరిగిన రెవెన్యూ సదస్సులో తూర్పుకాపు సంఘం మండల నాయకుడు శిరిగిరిశెట్టి నానాజీ తమ సంఘ నాయకులతో తహసీల్దార్‌ను కలిశారు. మండలంలో తూర్పు కాపులకు బీసీ డి కుల సర్టిఫికెట్లు అందించకపోవడంతో వందలాది మంది విద్యార్థులతో పాటు పలువురు ప్రజలు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం లేకుండా నష్ట పోతున్నారన్నారు. గతంలో వలే మండలంలో ఉన్న తూర్పు కాపులకు కుల నిర్ధారణ సర్టిఫికెట్లు అందించి ఆదుకోవాలని వినతి పత్రం అందించారు. రెవెన్యూ సదస్సులో పలువురు రైతుల నుంచి భూ సమస్యలపై దరఖాస్తులను తహసీల్దార్ స్వీకరించారు. వీఆర్వో సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు రామిరెడ్డి, సతీష్, సర్వేయర్ కిషోర్ పాల్గొన్నారు.

మినప పంట బీమాకు 15 వరకే గడువు


పంటల బీమా కరపత్రాన్ని అవిష్కరిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి విజయలక్ష్మి

రోలుగుంట: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం బుచ్చింపేట, వడ్డిప గ్రామాల్లో వ్యవసాయాధికారి పొలంబడి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులు సాగు చేస్తున్న పంటలు.. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. దీనిలో మినుము పంట సాగుకు భీమాకు సంబంధించిన కరపపత్రాన్ని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పాతల లక్ష్మీ రమణమ్మతో కలిసి ఆవిష్కరించారు. ప్రీమియం, బీమా మొత్తంపై వివరించారు. ఈ నెల 15 వరకు మాత్రమే గడువు ఉందన్నారు. ఇలా ఉండగా తుపాను హెచ్చరికల నేపథ్యంలో మూడు రోజుల పాటు వరి పంట కోతల పనులు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి కోరారు. కోతలు కోసి ఉంటే పనల మీద 5 శాతం ఉప్పు ద్రావణాన్ని లీటరు నీటిలో మిశ్రమం చేసి చల్లాలన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com